దేశానికిపోవటం అపాయకరమని భావించితే ఆ ఖైదీ ఏదేశంచేత పట్టుకోబడ్డాడో ఆ దేశంలోనే స్వేచ్ఛగా వుండిపోయే అవకాశం కల్పించాలని జెనివా ఒప్పందంలో వుంది" అని అమెరికా మొదలైనదేశాలు వాదిస్తున్నట్టు శ్రీ యమ్.వి.ఆర్. గారు చెప్పగా మొట్టమొదటిసారి యీ రచయిత వింటున్నాడు. ఇంత సాహసోపేతమైన వ్యాఖ్యకు పూనుకోనేముందు రచయిత తను వ్రాయబూను కొన్నది సత్యమా అసత్యమాఅని పరకాయించినట్లయితే బాగుండి ఉండేది. అమెరికాఅలాంటివాదన చేయటంలేదు సరిగదా, ఈ ప్రపంచంలో ఒక్క శ్రీ యం. వి. ఆర్. గారు మినహా జెనీవా కన్వెన్షనుకు ఆ అర్థంవుందని చెప్పినవారు యింకెవరూ కనపడరు. జెనీవా కన్వెన్షన్ పై అమెరికా వాదన యేమిటో తెలుసుకోగోరితే శ్రీ యమ్. వి. ఆర్. గారు యింకోమారు నా వ్యాసాన్ని చదవగలరని ఆశిస్తాను.

సమస్యను కేవలం సాంకేతిక న్యాయశాస్త్ర దృష్టితో పరిశీలించి ప్రయోజనం లేదంటారు శ్రీ యమ్. వి. ఆర్. గారు. తగాదా రానంతకాలం సమస్యను యే విధంగానైనా పరిశీలించవచ్చు. తగాదావచ్చిన తరువాత సాంకేతిక న్యాయశాస్త్రదృష్ట్యా పరిష్కరించటం మినహా యింతవరకూ వేరేమార్గం మానవకోటికి కనపడటంలేదు. ఈ విషయంపై ఆంగ్లో, ఇరానియన్ నూనె తగాదాలో అంతర్జాతీయ న్యాయస్థానం ఇచ్చిన తీర్పును శ్రీ యమ్. వి. ఆర్. గారు మరచిపోయి వుండవచ్చు.

---

# తన్నుమాలిన ధర్మం

శింగీతం శ్రీనివాసరావు

"తన్నుమాలిన ధర్మం మొదలు చెడ్డ బేరం" అన్నారు. అనాదిగా ఒచ్చే వేదాంత సూత్రాలలో చూడబోతే ఇదొక్కటే ఇంచుమించు ప్రాక్టికల్‌గా కనబడుతూంది. ఇక్కడ మనం మాట్లాడేది రెంటినిగురించి, ఒకటి ధర్మం. రెండు బేరం. ధర్మం అంటే తను చెయ్యవలసిన కార్యం. కాని బేరానికి నిర్వచనం ఇవ్వటం కొద్దిగా కష్టం. ఆఖరుకు ఆలోచించి ఆలోచించి చూస్తే మనకు ఒకటి విదితమౌతుంది. ధర్మం తను చెయ్యవలసిన పని అయితే బేరం ఇతరుల చేత చెయ్యించవలసిన పని. అందువల్ల ధర్మం చెయ్యటమనేది అది చేసే ఆయనమీద ఆధారపడి ఉంటుంది. ధర్మం చెయ్యనంతకాలం అతన్ని గురించి అనుకోవలసిన పనిలేదు. కాని ఒక్కసారి ధర్మబుద్ధి కలిగిందంటే కొంతసేపు అలా ధర్మరాజై కూర్చుంటాడు. అధర్మాత్ముడు ధర్మాత్ముడౌటకు పరిణామం అంటూ ఏమీలేదు. ఒక్క దూకులో ఔతాడు. మళ్ళీ ఒక్క దూకులో అధర్మాత్ముడౌతాడు. శిబిచక్రవర్తి తన మాంసం కోసి ఇవ్వటానికి పావురం ఒకగంట వాదిస్తే ఒప్పుకొన్న విషయంకాదు.

దశరథుని విషయంలో కైకేయికి వరం ఇచ్చేటప్పుడు తన ధర్మాన్ని అర్థంచేసుకొని, నవ్వుతూ నవ్వుతూ రెండు ఇష్టంవచ్చిన వరాలను కోరుకొమ్మని అనేశాడు. కాని తీరా శ్రీరామ పట్టాభిషేకానికి ముందు ఆ వరాలను కైకేయి అడిగేటప్పటికి తన ధర్మాన్ని తెలుసుకొనికూడ ఏమీ మాట్లాడలేక పోయాడు. అదే దశరథమహారాజు అదే కైకేయితో అదే ధర్మాన్నిగురించి రెండు పర్యాయాలూ రెండు విధాలుగా మెలిగాడు. అంటే ధర్మాన్నిగురించి ఆలోచించేటప్పుడు ఆ ధర్మం మనిషియొక్క అప్పటి పరిస్థితిమీద ఉంటుందని తేలుతుంది.

డబ్బులేనిదే జరగని కాలంలో సమయానికి డబ్బులేని ఒక గౌరవనీయుడు డబ్బుకోసం కొన్నిమైళ్ళు తిరగడం, అప్పిస్తే మళ్ళీ రెండురోజులలో తీర్చేస్తానని వాగ్దానం చెయ్యటం, కాని నెలల పర్యంతం ఆడబ్బు రాదనే విషయం తెలిసిన ప్రతిఒక్కరూ ఇప్పుడే ఇచ్చేసామనీ, నెలాఖరులో ఎక్కడుంటుందనీ, నెలమొదట్లో వెళ్తే డిస్ట్రిక్టుబోర్డుకింద పని చేస్తున్నామనీ సాకులు చెప్పటం చూస్తుంటాం. కాని ఈ నాటకం

అంతటితో ఆగదు. ఆమనిషి అంతటితో నిలువక కొన్ని రోజులక్రితం పరిచయం అయిన ఒకకొత్తాయన దగ్గరికెళ్ళి డబ్బడగటం, ఆయన సాయంత్రం ఆరుగంటలకు వస్తే ఖండితంగా ఇస్తానని చెప్పటము తీరా ఆనిమిషానికి వెళ్ళేసరికి, రావలసిన పైకం అందలేదని, రేపయితే ఇస్తాననటం ఇట్లా మూడునాలుగు రేపులు పోయింతర్వాత విసిగి ఊరుకోవటం దీనికంతా కారణమేమిటని కనుక్కుంటే ఆ కొత్తాయనకు మన గౌరవనీయుడు అప్పు తీర్చలేడనే సంగతి ఆఫీసులో ఎవరో చెప్తే ఆ కొత్తాయన "ఇస్తానిస్తా"నని ఇవ్వకపోవటం దానితో ఇదీ "ధర్మామేనా" అనిపించటంతో క్లైమాక్సు పూర్తి అవుతుంది.

అయితే మనమిక్కడ ఆలోచించవలసిన సంగతేమిటంటే దశరథుడు మాదిరే ఆ కొత్తాయన కూడ ఒక వరం ఇచ్చాడు. కొంతసేపటికి దశరథుడుమాదిరే ఆ వరం ఇచ్చిందానివల్ల కలగబోయే తంటా తెలుసుకొన్నాడు. అయితే దశరథుని విషయంలో వరం ఇచ్చేటప్పుడు అసలా వరం ఎటువంటిదై యుండవచ్చుననే సంగతి ఆ మహారాజునకేమాత్రం తెలీదు. ఒకవేళ అవసరం ఎటువంటిదో ముందరసే తెలుసుకొని కొడుకు అడవులకు పోయినా పర్వాలేదనే ఉద్దేశ్యంతో వరమిచ్చి ఉండినట్లయితే దశరథుడొక ద్రోహి అయి ఉండేవాడు. కాని అతనికందులో ఉండేకుట్ర ఏమాత్రం తెలియదు. అందువల్ల వరం ఇవ్వటంలో అతనిదేమీ తప్పులేదు ఆలోచించకుండా వరమివ్వటం తప్ప.

కాని అప్పిస్తానన్న కొత్తాయన సంగతి అలా కాదు. తను ఏం వరం ఇచ్చేదీ బాగా తెలుసు. "డబ్బిస్తాను ఖండితంగా" అనే వాక్యాన్ని కంటద్దాల సాక్షిగా చెప్పాడు. ఒక నూతనవ్యక్తికి అప్పిచ్చేదానివల్ల వచ్చే కష్ట నష్టాలు ఊహించుకునే శక్తికూడ ఉంది. పైగా ఎవరో ఒక దుర్మార్గుడు గౌరవనీయుని గురించి ఒక గాలి వార్త చెప్పగానే నమ్మి తెలిసి తెలిసి ఇచ్చిన వాగ్దానానికి, వరానికి ఎదురు తిరగడం పెద్దల ప్రకారం పెద్దతప్పు. అసలు లోకంపోకడ తెలిసి కూడ అలాంటి వరమివ్వడం మొదటితప్పు. అందువల్ల వరాన్నిచ్చే సమయం వచ్చినప్పుడు ఈ కొత్తాయనకు వచ్చిన క్లిష్టపరిస్థితి, ధర్మసందేహం దశరథుని సమస్యకన్న కష్టతరమైనది. దశరథుని సమస్య నోట్లో శీకాయ అయితే ఇతని సమస్య కంట్లో మిరపకాయ.

అయితే ఇక్కడ జరిగిన విచిత్రసంఘటన ఏమిటంటే దశరథునిలో ఏతప్పు లేకపోయినా ఆ మహారాజు ఏడ్చిఏడ్చి ఆఖరికి వరంఇచ్చి శ్రీరాముని అడవులకు పంపి ధర్మాన్ని పాలించానన్నాడు. కాని అప్పిస్తానన్న కొత్తాయన తప్పు తనదైనా హాయిగా కులాసాగా డబ్బుకోసరం వచ్చినాయనను వచ్చినదారినే వెనక్కుళ్ళమన్నాడు.

ఇప్పుడు వీరిద్దరిలో భేదం ఏమిటని ఆలోచిస్తే—ప్రజలసౌఖ్యమే రాజు సౌఖ్యం, ప్రజల కష్టమే రాజుకష్టం, ఒక్కొక్కప్పుడు కష్టంవల్ల సరిగ్గా పాలించకపోతే రాజుకష్టమే ప్రజలకష్టం అనే ఇత్యాది సంగతులు బాగా తెలిసి కూడా దేశంలో అంతమంది కష్టపడ్తారని తెలిసి కూడం ఒక్కకైకేయికోసరం దశరథుడు తనసౌఖ్యాన్ని అందరి సౌఖ్యాలను త్యాగంచేశాడు. దీనికంతా కారణం విషయాన్ని ప్రాక్టికల్‌గా ఆలోచించకపోవడమనిపిస్తుంది. కైకేయి ఆ వరాలడగంగానే "ఛా ఫో దుర్మార్గురాలా" అని ఒక్కసారి కసిరిఉంటే రామాయణంలో ప్రతిభాగం ఒక "కామెడీ" అయ్యుండేది. అసలప్పుడు రామాయణగాథ అనేదే ఒకటుండేది కాదేమో! కాని మన కొత్తాయన విషయం రామాయణగాథంత పైకి రాకపోవటానికి కారణమేమిటంటే అతను దాన్ని చాల సునాయాసంగా ముగించేసాడు. "ధర్మం" అనేదాన్ని అతను "ప్రాక్టికల్‌వ్యూ"తో చూచాడు. అంటే అతను ఆధారంగా చేసుకొన్న గొప్ప సిద్ధాంతం "తన్ను మాలిన ధర్మం—మొదలుచెడ్డ బేరం." అందువల్లనే తన సౌఖ్యాన్ని ముందర చూచుకొని, అది భంగం అయ్యే విషయంలో లౌకికజ్ఞానంతో జాగ్రత్తపడ్డాడు. దశరథ మహారాజుమాత్రం లోకం తెలియని అమాయకునివలె తన్నుమాలినధర్మంచేశాడు. కాబట్టి పెద్దలు దాన్ని ధర్మం అన్నా అది అధర్మంగానే అగుపడ్తుంది.

ఇక "బేరం"అనేది "ఇంకొకరిచేత చేయించవలసిన పని"అని నిర్వచించాం. ఇప్పుడు వంకాయలు కొన్నవెల వీశెకి (రౌండ్ ఫిగర్‌గా) ఎనిమి

దణాలనుకుందాం. అమ్మేవాడు దాన్ని జేడ లాభంతో పదణాలకమ్మవలెననుకున్నాడనుకోండి. అప్పుడమ్మేవాడు మనచేతనే వెల పన్నెండణాలనిపించటానికి ప్రయత్నిస్తాడు. మనము అతనిచేత ఎనిమిదణాలనిపించటానికి ప్రయత్నిస్తాము. ఈ మధ్య జరిగే తర్జనభర్జనలతో అది సరిగ్గా పదణాలకు దిగుతుంది. అంటే అమ్మేవాడు గొప్ప వ్యాపారస్థుడన్నమాట. ఎందుకంటే కొనే వాళ్ళ సైకాలజీని బాగా కనిపెట్టి, "నేరం"అనే క్రియలో సాధిస్తాడు. ఈ తర్జనభర్జనలలో కావలసినన్ని స్టెప్స్ ఉన్నాయి. ఆ మార్గంలోనే పైకెళ్ళాలి. గణితశాస్త్రంలో ఒక సిద్ధాంతాన్ని నిరూపించాలంటే కొన్ని నియమితమైన మెట్లల్లో వెళ్ళాలి. ఇటువంటి మెట్లులేని ఏ శాస్త్రానికీ గౌరవంలేదు. సర్ జేమ్స్ అనే ఒక గొప్ప గణిత శాస్త్రజ్ఞుడు ప్రపంచమంతా—కాదు — ఈ విశ్వమంతా గణితమన్నాడు. అలాంటప్పుడు గణితములో ఇంచుమించు సమానంగా తులతూగటమే కాక, ఇప్పుడిప్పుడే వృద్ధికివచ్చే "సైకాలజీ"లేక మనస్తత్వ శాస్త్రాన్ని ఆధారంగాచేసుకొని వర్ధిల్లే "నేరం"అనే శాస్త్రాన్ని సరిగ్గా అర్థంచేసుకున్నామంటే "ప్రపంచమంతా నేరం"అనే సిద్ధాంతం సత్యానికి దూరంకాదన్న విషయం అర్థమౌతుంది. ఒక చిన్న వంకాయల నేరంలోనే యింత దత్తాంశము, నిర్మాణక్రమము, అవ్యక్తాన్ని ఊహించుకోటం, మనస్సును గ్రహించటం, పరిశోధన సలుపటం మున్నగునవి కావలసినంత ఉంది. ఇక ఒక ఉద్యోగానికి ఇంటర్వ్యూకు వెళ్ళినప్పుడు అతనిచేత ఇతను, ఇతనిచేత అతను కొన్ని మాటలను రప్పించే ప్రయత్నంలో అనుసరించిన నేరం; ఎన్నికలలో నిలిచి "తనకే ఓట్లు వేయుట" అనే కార్యాన్ని పదిమందిచేత చేయించటంలో వ్యక్తం అయ్యే నేరం. రెండు రాష్ట్రాలు ఒక వివాద ప్రాంతాన్ని గురించి తిట్టుకుంటూ, కొట్టుకుంటూ ఉండే సమయంలో సంధికుదర్చటానికి వచ్చిన మూడవవారినటుంచి, తగవులు పెట్టి చూచి చప్పట్లు కొట్టే నాల్గవవారిని చూచి చాలించుకోలేక సకిలించి, సతాయించి, సముదాయించటానికి కష్టపడ్తూండేటప్పుడు మనకు కనబడే నేరం-అంతేకాదు. రెండు దేశాలు వేరేవేరే "ఇజమ్స్"తో పోరాడుతూ తమ కత్తులు కటారులను వీపువెనుక పెట్టుకొని "క్షూక కిపెత్తుకుపోయిం"దనిపించటానికి ప్రయత్నిస్తూ, వైరులను జయించటానికి ఏమీ ఎరుగని మిగతాదేశాలను పంపించటానికి జరిపే సున్నితమైన నేరం, ఇదంతా చూస్తుంటే ప్రపంచమంతా నేరం అనటానికెట్టి సందేహమూలేదు.

అందువల్ల నేరం అనేది ఒక మొదటి మెట్టు నుంచి నియమిత మార్గంలో పైకి రావలసినది కాబట్టి, మొదలేతప్పిందంటే నేరం అంతా చీట్ల పేకతో కట్టిన ఇల్లులా కూలిపోతుంది. అందుకే మొదలుచెడ్డ నేరం అన్నారు.

భక్తి మెండై, ఉన్నదంతా శ్రీరామచంద్రమూర్తికి అర్పించి ఆఖరకు ఏమీతోచక జైల్లో కూర్చున్న రామదాసుకు, ఇదంతా తన్నుమాలిన ధర్మమనిపించి "సీతమ్మకు చేయిస్తి చింతాకు పతక"మని తల బాదుకోవటం, పెట్టుకోసరం అతిథికి పక్క ఇచ్చేసి తను నేలమీద పడుకొని పొద్దున్న ఒళ్లు పట్టించుకోటం, దేశానికి దేశానికి మధ్య యుద్ధం జరుగుతుంటే మూడవదేశంమధ్యవర్తిత్వానికి పోయి విరివిగా తన్నులు తినడం, అడ్వాన్సుతీసుకోకుండా డాక్టరు రోగికి మందులు మాకులు అంతా ఇచ్చేసి నయమైనతర్వాత డబ్బు రాకపోతే నోట్లో వేలుపెట్టుకోవడం, ఇంకా ఇటువంటివి ఆక్షో తొంభైఆరు తన్నుమాలిన ధర్మానికి, మొదలుచెడ్డ నేరానికి ఉదాహరణాలు. అసలు ప్రతి వ్యక్తి ధర్మం అంటే ఏమిటో, ఒకటే కార్యం ఎప్పుడు ధర్మమో, ఎప్పుడు అధర్మమో తర్కించుకొని, ధర్మం, నీతి—వీటిని గురించి సనాతనంగావచ్చే మూఢవిశ్వాసాల్ని లెక్కచేయక, అజ్ఞానంతో తన్నుమాలిన ధర్మం చెయ్యకుండా, జీవితంలో మొదలుచెడ్డ నేరం అంటూ ఒకటి లేకుండా చూచుకుంటే ఆ వ్యక్తే కాదు-ఒక ఊరు, ఒక రాష్ట్రం, ఒక దేశం-అంతే కాదు-మానవకోటి అంతా బాగుపడక తప్పదు.

---

నాస్తికత్వం అంటే అవిశ్వాసం మాత్రమేకాదు; విధ్వంసయుతమై, రాగశూన్యమై బీడువారి నదీకాదు. తద్భిన్నంగా నాస్తికత్వం అంటే ఉత్సాహయుతమై సఫలమైన సత్యస్థాపన; ఉన్నత మానవత్వంయొక్క ఆచరణను నిర్మాణయుతంగా సమర్థించుట.